సాక్షి
నిజామాబాద్
సోమవారం । 23 । జనవరి । 2023



పసుపు రైతు దిగాలు

పసుపు దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

- 8లో ▸



హిందూ సంస్కృతి గొప్పది

హిందూ సంస్కృతి గొప్పదని, ప్రపంచ మేధావులు మన సంస్కృతిని తెలుసుకుంటున్నారని విద్యారణ్య భారతి స్వామి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /17.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీయవచ్చు. సాయంత్రం వేళ చలి తీవ్రత పెరగవచ్చు. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కార్పొరేటర్‌పై కేసు నమోదు

- రిమాండ్‌కు తరలింపు

ఖలీల్‌వాడి : నగర కార్పొరేటర్ హరూర్‌ఖాన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని 13 డివిజన్‌లో పరిధిలోని ధర్మపురిహిల్స్‌లోని మైనారిటీ శ్మశాన వాటికకు ప్రభుత్వం 2005లో రెండు ఎకరాలు కేటాయించారు. ఈ భూమిలో స్థానిక కార్పొరేటర్ హరూర్‌ఖాన్ మొరం తవ్వకాలు, భూకబ్జాకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో శనివారం ఎంఐఎం పార్టీ నుంచి ఆయనను బహిష్కరించారు. ప్రభుత్వ స్థలం కబ్జాతో పాటు ఎలాంటి అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపట్టడంపై నగరంలోని ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మైనారిటీ ప్రజల మనోభావాలను దెబ్బ తీసినందుకు గాను దీనిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో కార్పొరేటర్ హరూర్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్సై సాయికుమార్ గౌడ్ తెలిపారు.

విధులు నిర్వహిస్తూ.. నిరసన తెలుపుతూ..



మోర్తాడ్(బాల్కొండ): వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా తమ శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని రెండో ఏఎన్ఎంలుగా నియమించబడిన ఉద్యోగినులు వాపోతున్నారు. కంటి విడత రెండో విడత కార్యక్రమంలో విధులు నిర్వహిస్తూనే ప్రభుత్వం తీరును ఎండగడుతూ వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 350 మంది రెండో ఏఎన్ఎంలు వివిధ సబ్‌సెంటర్లలో విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 18ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు తమను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రభుత్వం కూడా కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని గతంలో హామీ ఇచ్చింది. వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఆ జాబితాలో రెండో ఏఎన్ఎంలు లేకపోవడం గమనార్హం. కంటి వెలుగు విధుల్లో పాల్గొంటున్న రెండో ఏఎన్ఎంలు తమ నిరసనను ప్రభుత్వం గుర్తించేలా వ్యవహరిస్తున్నారు.

జిల్లాను సందర్శించిన జపాన్ శాస్త్రవేత్తలు



కామారెడ్డి టౌన్: తాడ్వాయి మండలంలోని అబ్దుల్‌నగర్ శివారులో ఆదివారం జపాన్ శాస్త్రవేత్తలు పర్యటించారు. ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో జపాన్ శాస్త్రవేత్తలు దాదాపు 300 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ ఫార్మా కంపెనీ నెలకొలిపేందుకు స్థలాలు అనుకూలంగా ఉన్నాయని పైడి ఎల్లారెడ్డి తెలిపారు. వారి వెంట నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, లింగంపేట జెడ్పీటీసీ శ్రీలత, సంతోష్‌రెడ్డి, దోమకొండ జెడ్పీటీసీ తిరుమల్‌గౌడ్, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, లింగంపేట సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ధనుంజయ్, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పక్కా కమర్షియల్!

- నగరంలో ప్రైవేట్ గెస్ట్‌హౌస్ నిర్మాణాలకు అనుమతి లేదు
- నివాస గృహాలను కమర్షియల్‌గా మార్చి దందా
- కార్పొరేషన్ పర్యవేక్షణ లేకపోవడంతో దర్జాగా వ్యాపారం
- చర్యలు తీసుకోని అధికారులు

నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాస గృహాలు నిర్మించుకుంటామంటూ అనుమతులు తీసుకుని వాటిని దర్జాగా గెస్ట్‌హౌస్‌ల పేరుతో దందా నిర్వహిస్తున్నారు. పెళ్లిళ్లకు, చిన్న ఫంక్షన్లకు, ఇతర శుభకార్యాలకు వాటిని వినియోగిస్తున్నారు. కమర్షియల్‌గా వినియోగిస్తున్నప్పటికీ వాటికి అదనంగా ఎలాంటి పన్నులు చెల్లించట్లేదు.



బోధన్‌రోడ్‌లో ప్రధాన రహదారిపై ఉన్న అతిథి గృహం

నిజామాబాద్‌నాగారం : నగరంలో ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌ల పేరుతో దందా నడుస్తోంది. ఇళ్లనే గెస్ట్‌హౌస్‌లుగా మార్చేసి శుభకార్యాలకు రోజుకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు నిర్వాహకులు అద్దె వసూలు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇటీవల తీసిన లెక్కాల ప్రకారం నగరంలో 29 ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయని, అనధికారికంగా రెట్టింపు సంఖ్యలో ఉన్నట్లు తేలింది. ఈ గెస్ట్‌హౌస్‌ల నిర్వాహకులు ఏళ్ల తరబడిగా మున్సిపల్ పన్నుల, కమర్షియల్ కరెంట్ బిల్లులు ఎగ్గొడుతూ దర్జాగా వాటిని నిర్వహించుకుంటున్నారు.

నగరంలో..

నగరంలోని కార్పొరేషన్ పరిధిలో మాలపల్లి, హైమద్‌పురా కోజాకాలనీ, బోధన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఈ గెస్ట్‌హౌస్‌లు ఎక్కువగా ఉన్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ ప్రాంతంలో ఇళ్లు చాలా ఇరుకుగా ఉంటాయి. పెళ్లిళ్లు, ఇతర చిన్నచిన్న ఫంక్షన్ల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అతిథుల కోసం ఈ గెస్ట్‌హౌస్‌లు ఉపయోగపడుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే అతిథుల కోసం ఫంక్షన్ నిర్వాహకులు ఈ గెస్ట్‌హౌస్‌లను అరేంజ్ చేస్తున్నారు. లాడ్జీల్లో అయితే అధిక మొత్తంలో ధర చెల్లించాల్సి వస్తుందని ఉద్దేశంతో వీటిని వినియోగిస్తున్నారు. ఈ రోజుల్లో అతిథి గృహాల సంస్కృతి విపరీతంగా పెరిగిపోయింది. ఇక అందులోనే భోజనం వసతి కల్పిస్తున్నారు. ఇళ్లమాదిరిగా ఉండడంతో వీటికి ఆదరణ బాగా పెరిగింది. ఒక్కో రోజుకు అందులో ఎంతమంది ఉన్నా సరే రూ. 10వేల నుంచి రూ. 15వేల వరకు వసూలు చేస్తున్నారు.

నగరంలో అతిథి గృహాల వివరాలివి..

అక్రమంగా వెలిసినవి	అధికారులు గుర్తించినవి	12అతిథిగృహాలకు వసూలైన పన్ను
40కి పైనే..	29	రూ. 6 లక్షలు

భువన్ యాప్ ద్వారా..

మున్సిపల్, విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వీరి దందా మూడుపువ్వులు ఆరుకాయాలుగా సాగుతోంది. అయితే ఇటీవల భువన్‌యాప్ రావడంతో ఈ విషయాలన్ని బయటకు వచ్చాయి. దీంతో మున్సిపల్ రెవెన్యూ అధికారులు నగరంలో 29 అతిథిగృహాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని గుర్తించారు. అయితే ఇందులో 12 అతిథి గృహాలకు భువన్ యాప్ ద్వారా ట్యాక్సీలు కట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ 12 అతిథి గృహాలకు కలిపి సుమారుగా రూ. 6 లక్షల ట్యాక్సీ వసూలు చేసినట్లు తెలిసింది. అలాగే గుర్తించనవి ఇంకా మరెన్నో ఉన్నట్లు సమాచారం.

అనుమతి లేదు..

నగరంలో అతిథి గృహాలు నిబంధనలకు విరుద్ధంగా వెలిశాయి. ఇటీవలే నగరంలో 29 ఉన్నట్లు గు ర్తించడం జరిగింది. ఇప్పటికే 12 అతిథి గృహాలను భువన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి పన్నులు చెల్లించే లా చూస్తున్నాం. నిబంధనల ప్రకారం నగరంలో ఎక్కడ కూడా అతిథి గృహాలకు అనుమతి లేదు. మిగితా వాటికి కూడా ఇదే పద్ధతితో రెండు రెట్ల ప న్నులు వసూలు చేస్తాం. అక్రమంగా అతిథి గృహాల బోర్డులు పెడితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. **- నరేందర్,** మున్సిపల్ ఆర్ఐ





అనుమతి లేకుండా మాలపల్లి, అహ్మద్‌పుర కాలనీలలో వెలిసిన అతిథి గృహాలు

తేలిన పదోన్నతుల లెక్క

- 103 మంది పీజీ హెచ్‌ఎంలకు, 277 మంది ఎస్‌ఏలకు ప్రమోషన్
- ఖాళీలు గుర్తించిన విద్యాశాఖ
- ఎనిమిదేళ్లు పూర్తయినవారు 1,502 మంది
- నేడు హైదరాబాద్‌లో విద్యాశాఖ సమావేశానికి డీఈవో

పోస్టుల వివరాలు..	
పాఠశాలలు	1,191
విద్యార్థులు (లక్షల్లో)	1.20
మొత్తం టీచర్లు	4,752
స్కూల్ అసిస్టెంట్లు	2,015
లాంగ్వేజ్ పండిట్లు	489
ఎస్జీటీలు	2,144
పీఈటీలు	104

నిజామాబాద్ అర్బన్ : గత కొన్నేళ్లుగా పదోన్నతుల కోసం వేచి చూస్తున్న టీచర్లకు ఎట్టకేలకు ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలకు అనుమతి ఇచ్చి షెడ్యూల్ ఇవ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఈ ప్రక్రియపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఖాళీలను గుర్తించింది. ఇప్పటికే ఖాళీలను గుర్తించిన విద్యాశాఖ తన వెబ్‌సైట్‌లో వాటి వివరాలు ఉంచింది. అందులో కొన్ని తప్పులు ఉండడంతో సవరణ చేస్తోంది. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల వినతి మేరకు ఖాళీలపై మరోసారి పరిశీలన చేస్తుంది. సాధారణంగా రెండేళ్లయితే బదిలీకి అర్హులుగా గుర్తించారు. ప్రస్తుతం మూడేళ్లు పూర్తయితేనే అర్హులుగా గుర్తిస్తున్నారు.



జిల్లాలో..

జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం విద్యాశాఖ అధికారులు 103 పీజీహెచ్ఎం ఖాళీలు గుర్తించగా లోకల్ బాడీలో 90 ఖాళీలు, ప్రభుత్వ విభాగంలో 13 ఖాళీలు గుర్తించారు. స్కూల్ అసిస్టెంట్ల విభాగంలో 277 ఖాళీలు గుర్తించారు. ఎనిమిదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న టీచర్ల వివరాలపై నేటికి స్పష్టత రాలేదు. ఇంకా పరిశీలిస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు సుమారు 1,503 వరకు ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. కాగా పీజీహెచ్ఎం పోస్టులు మల్టీజోన్ పరిధిలో ఉన్నాయి. వరంగల్ పరిధిలో ఈ బదిలీలు జరుగుతాయి. ఇందులో మొత్తం 993 ఖాళీలు ఉన్నాయి. కొందరు హెచ్ఎంలు మల్టీ జోన్ పరిధిలో వెళ్లడంతో పదోన్నతులకు సుముఖంగా ఉన్నప్పటికీ జోన్ బదిలీ ఉండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 2,144 మంది ఎస్జీటీలు ఉండగా వీరికి బదిలీలు చేపట్టనున్నారు. ఎక్కువ మొత్తంలో వీరు బదిలీలు కానున్నారు.

స్పష్టంగా ప్రదర్శించాలి



పదోన్నతుల ప్రక్రియలో ఖాళీల గుర్తింపులో సక్రమంగా లేదు. విద్యాశాఖ అధికారుల ఖాళీలు స్పష్టంగా గుర్తించి పదోన్నతులు చేపట్టాలి. టీచర్ల చాలామంది ఆందోళనతో ఉన్నారు. ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి. **- మదవేటి వినోద్ కుమార్,** టీసీటీయూ జిల్లా అధ్యక్షుడు

పారదర్శకంగా చేపట్టాలి



టీచర్ల బదిలీలు పదోన్నతులు సక్రమంగా చేపట్టాలి. ఎప్పటికప్పుడు విద్యాశాఖ సమాచారం అందించాలి. కొన్నేళ్లుగా పదోన్నతులు, బదిలీలు లేకపోవడంతో టీచర్ల ఆందోళన చెందుతున్నారు. పకడ్బందీగా ఈ ప్రకియ చేపట్టి న్యాయం జరిగేలా చూడాలి. **- గద్దల రమేశ్,** స్కూల్ అసిస్టెంట్

ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తి లేదు

- సీసీరోడ్ల నిర్మాణానికి రూ. 20 కోట్ల నిధులు మంజూరు
- 25 జీపీల కొత్త భవనాలకు రూ. 6.50 కోట్లు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



తాళ్లరాంపూర్‌లో ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : బాల్కొండ నియోజకవర్గంలో కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 20 కోట్లు మంజూరైనట్లు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఐదేళ్ల పూర్తి కాల పరిమితి పూర్తయిన తర్వాతే ఎన్నికలకు వెళ్తుందని, మందుస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. దీనిని గమనించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వారు నిశ్చింతగా ఉండవచ్చని చెప్పారు. ఆదివారం వేల్పూర్ మండల కేంద్రంలోని ఆయన క్యాంప్ కార్యాయలంలో మాట్లాడారు. ఎనిమిదిన్నరేళ్ల కాలంలో కొత్తగా మంజూరైన నిధులను కలుపుకొని సీసీరోడ్లకు రూ. 102 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

కొత్తగా మంజూరైన నిధుల్లో బాల్కొండకు రూ. 2.80 కోట్లు, మెండోరాకు రూ. 1.90 కోట్లు, ముప్కాల్‌కు రూ. 1.60 కోట్లు, కమ్మర్‌పల్లికి రూ. 3.20 కోట్లు, భీమ్‌గల్‌కు రూ. 3.05 కోట్లు, వేల్పూర్‌కు రూ. 3.70 కోట్లు, ఏర్గట్లకు రూ. 1.70 కోట్లు, మోర్తాడ్‌కు రూ. 1.20 కోట్లు చొప్పున మంజూరైనట్లు చెప్పారు. సీసీరోడ్ల నిర్మాణం 90 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు బాల్కొండ నియోజకవర్గంలో 25 గ్రామాలలో కొత్త జీపీ భవనాలకు రూ. 6.50 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. పాతవి, కొత్తవి కలుపుకొని నియోజకవర్గంలో 62 గ్రామపంచాయతీలకు నూతన భవనాలు మంజూరు చేయించానని వెల్లడించారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ మంచి పనులు చేయాలి


మోర్తాడ్ : ఎంపీ అర్వింద్.. నీవు నన్ను తిట్టడం కాదు ప్రజలకు ఏదైనా మంచి చేయడం నేర్చుకోవాలంటూ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. తాను బాల్కొండ నియోజకవర్గంలో రూ.40 కోట్ల వరకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఇప్పించానని ఎంపీకి ఇంగితం ఉంటే ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి ప్రజలకు ఏమైనా లబ్ధి చేకూర్చాలని హితవు పలికారు. ఆదివారం మంత్రి ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్, దోంచందలో పర్యటించారు. తాళ్లరాంపూర్‌లో మల్లన్న ఆలయానికి శంకుస్థాపన చేసిన ఆయన తడపాకల్ నుంచి దోంచందకు బీటీ రోడ్డు నిర్మాణం, దోంచంద నుంచి గుమ్మిర్యాల్ మీదుగా, కొండాపూర్ వరకు బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ వర్తించాలంటే బైక్ ఉండకూడదన్నారు. ఇప్పుడు బైక్ లేని ఇళ్లు ఏదైనా ఉందా అని మంత్రి ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీతో రాష్ట్రంలో ఎంతో మందికి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు కేవలం మత విద్వేశాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. బాల్కొండలో సీఎం ఆశీస్సులతో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, సహకార సంఘాల చైర్మన్‌లు పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి, బర్మ నర్సయ్య, సర్పంచ్‌లు భానుప్రసాద్, రాధ, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, నాయకులు రాజాపూర్ణనందం, అశోక్ యాదవ్, అంజిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారుల నిర్బంధం



కస్‌కల్‌లో అధికారులను నిర్బంధించిన గ్రామస్తులు

తాడ్వాయి: మండలంలోని కస్‌కల్‌లో ఆదివారం ట్రాన్స్‌కో అధికారులను గ్రామస్తులు నిర్బంధించారు. లైన్‌మన్ మహేష్, బిల్ కలెక్టర్ వెంకటి, లైన్ ఇన్స్పెక్టర్ నర్సయ్య, జూనియర్ లైన్‌మెన్ రాజశేఖర్, శ్రావణ్ కరెంటు బిల్లులు వసూల్ చేయడానికి గ్రామానికి వెళ్లారు. ఏసీడీ చార్జీల పేరుతో అధికంగా బిల్లులు వసూలు చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినెల బిల్లులు సక్రమంగా చెల్లించినా అధికంగా ఎందుకు వచ్చాయని అధికారులపై మండిపడ్డారు. సరిగ్గా సమాధానం చెప్పకపోవడంతో గ్రామంలోని వృద్ధుల సంఘం వారిని నిర్బంధించి అరగంట అనంతరం విడిచిపెట్టారు.



నిజామాబాద్ నగరంలో ఆదివారం సూర్యాస్తమయం తర్వాత ఆకాశం అరుణవర్ణంలో కనిపించి అందరినీ అలరించింది. ఈ దృశ్యం నగరవాసులకు కనువిందు చేసింది. ఈ చిత్రాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

- సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

విశ్వాసం, త్యాగాలే ఆర్‌ఎస్‌ఎస్ పునాదులు

- రాష్ట్ర గ్రామ సంపర్క్ ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ

సుభాష్‌నగర్ : నేతాజీ బోధించిన విశ్వాసం, కర్తవ్యం, త్యాగాల ఆధారంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందని రాష్ట్ర గ్రామ సంపర్క్ ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ అన్నారు. నగరంలోని దుబ్బరోడ్డులోని అక్షర్‌ధామ్ హైస్కూల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహా సాంఘిక్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది స్వయం సేవకులు పథ సంచలన్ నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ నేతాజీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన స్ఫూర్తిని అందుకోవాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో 24 గంటలు దేశం గురించి ఆలోచించిన గొప్ప దేశభక్తుడు నేతాజీ అని గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎక్కడా కనిపించదు కానీ అంతటా ఉంటుందన్నారు. స్వాతంత్ర్య అమృతోత్స వాల సందర్భంగా అజ్ఞాత దేశభక్తుల చరిత్ర ను భావితరాలకు అందిద్దామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘచాలక్ జనగాం నరేంద్ర, జిల్లా సంఘ చాలక్ కాపర్తి గురుచరుణం నగర సంఘ చాలక్ శ్రీనివాస్, విభాగ్ ప్రచారక్ నరేష్, గణేష్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

ప్రశాంతంగా ఏఈఈ పరీక్ష



నిజామాబాద్అర్బన్: టీఎస్పీఎస్సీ అధ్వర్యంలో ఏఈఈల నియామకానికి సంబంధించిన నియామక పరీక్ష జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో మొత్తం 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఉదయం,మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. పరీక్షకు గంట ముందుగానే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు. అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పరీక్షల నిర్వహణ పరిశీలించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



బాల్కొండ: యువత గంజాయికి,మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్కొండ పోచమ్మగల్లీలో శనివారం గంజాయి విక్రయిస్తు, సేవిస్తున్న ముగ్గురు బాలురలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టగా, అనంతరం పరిశీలన హోంకు తరలించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పిల్లలను, యువకులను సరిగ్గా పరిశీలన చేస్తు గమనించాలన్నారు. బాలురను పట్టుకున్న ఎస్సై గోపి, ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సాయన్న, కానిస్టేబుళ్లు సతీష్, సదానంద్, ప్రశాంత్, పవన్, నరేశ్, రాకేశ్‌లను అభినందించారు.

హైకోర్టు ఉత్తర్వులను అమలుపర్చాలి

డిచ్‌పల్లి: తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నిర్వహించిన ఈవెంట్స్‌పై హైకోర్టు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విగ్నేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈవెంట్స్‌లో ఎత్తులో డిస్‌క్వాలిఫై అయిన అభ్యర్థులకు డిజిటల్ మీటర్‌లో ఒక సెంటిమీటర్ వరకు తేడా చూపిస్తుందన్నారు. దానివల్ల అభ్యర్థులకు అన్యాయం జరగడంతో అభ్యర్థులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్ ఈనెల నాలుగో తేదీన కోర్టుకు వచ్చింది. దీనిపై హైకోర్టులో జడ్జి వాదోపవాదనలు విన్న తర్వాత ఇన్ సర్వీస్‌లో ఉన్న అభ్యర్థులను రెండు సెంటీమీటర్ల తేడా వరకు, నార్మల్ అభ్యర్థులు 1.5 సెంటీమీటర్ తేడా ఉన్న వాళ్లందరికి మాన్యువల్ గేజ్‌తో కొలిచి మెయిన్స్‌కు అవకాశం కల్పించాలని తీర్పుచెప్పారు. ఈ విషయంలో హైకోర్టు జడ్జిమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

317 బాధితులకు న్యాయం చేయాలి

నిజామాబాద్అర్బన్: 317 జీవో కింద భార్యభర్తలు ఇతర జిల్లాలకు బదిలీ కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారిని సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాశాఖ డైరెక్టర్ స్పౌజ్ బదిలీలపై మాట్లాడిన విధానం సరిగా లేదని డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శంతన్ పేర్కొన్నారు. అలాగే టీచర్ల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్పౌజ్ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సత్యానంద్ డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ధర్పల్లి: మండల కేంద్రంలో శనివారం అర్థరాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పసుపు రైతు దిగాలు..

- అధిక వర్షాలతో పసుపు పంటకు సోకిన దుంపకుళ్లు
- ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా..
- 10 క్వింటాళ్లే వస్తున్న వైనం



మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన ఒల్లాదపు గంగారాం రెండు ఎకరాల్లో పసుపు సాగు చేశాడు. ఇటీవల పసుపు తవ్వి ఉడికించగా అతనికి కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి లభించింది. ఒక ఎకరం విస్తీర్ణంలో 35 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి లభించాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా 60 క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోయింది. దుంపకుళ్లు సోకడం వల్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. ఇలా పసుపు సాగు చేసిన ఎంతో మంది రైతులకు జరిగిన నష్టం ఇదీ.

మోర్తాడ్(బాల్కొండ)/బాల్కొండ: పసుపు పంటకు ధర లేక అ ల్లాడిపోతున్న రైతులకు దిగుబడి సరిగా లేక దిగులు పడుతున్నారు. అధిక వర్షాల వల్ల పసుపు సాగు చేసిన పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో దుంపకుళ్లు సోకింది. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. జిల్లాలో ఈ సీజనులో దాదాపు 33వేల ఎకరాల్లో పసుపు సాగు చేయగా అనేక పొలాల్లో దిగుబడి తగ్గిపోయింది. ఒక ఎకరం విస్తీర్ణంలో పంట దిగుబడి 40 క్వింటాళ్ల వరకు లభిస్తే నే రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం. కానీ కేవలం 25 శాతం దిగుబడి లభించడంతో రైతులకు పెట్టుబడులు చేతికి అందని పరిస్థితి ఏర్పడింది.

ఎకరానికి రూ.1.75లక్షల పెట్టుబడి..

సాధారణంగా ఒక ఎకరం పసుపు సాగు చేయడానికి సుమారు రూ.1.25లక్షల నుంచి రూ.1.75లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. పసుపు దిగుబడిని దృష్టిలో ఉంచుకుని పశువుల పేడ, కోళ్ల పేడ, నల్లమట్టిని రైతులు గడచిన వేసవి కాలంలో కొనుగోలు చేశారు. విత్తనానికి కూడా



పసుపును యంత్రంతో ఉడికిస్తున్న రైతులు



బాల్కొండలో సాగవుతున్న పసుపు పంట

రైతులు భారీగానే ఖర్చు చేశారు. ఎనిమిది నెలల పాటు పసుపు పంటను కంటికి రెప్పలా రైతులు కాపాడుకుంటే దిగుబడికి దెబ్బ పడటంతో ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పసుపు పంటకు క్వింటాలుకు రూ.5వేలకు మించి ధర లభించడం లేదు. ఒక ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి లభిస్తే రైతులకు కేవలం రూ.50వేల ఆదాయమే సమకూరుతుంది. అంటే పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడిని కోల్పోవడమే కాకుండా రైతుల శ్రమకు విలువ లేకుండా పోతుంది. పసుపును తవ్వడం, ఉడికించడం, ఎండబెట్టడం, మార్కెట్‌కు తరలించడానికి మొత్తం ఖర్చు రైతులు భరించాల్సి ఉంటుంది. ఇంత చేస్తే సమకూరే ఆదాయంలో భారీ లోటు ఏర్పడటం రైతులను అయోమయానికి గురి చేస్తుంది.



తవ్విన పసుపును ఏరుతున్న కూలీలు, రైతులు

దుంపకుళ్లను తట్టుకునే వంగడాలు లేవు..

పసుపు రైతులకు దుంపకుళ్లను తట్టుకునే పసుపు వంగడాలను అందుబాటులోకి తీసుకరాకపోవడం పట్ల సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది. పసుపు పరిశోధనలు ముందుకు సాగకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఏదిఏమైనా ఈసారి పసుపు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని స్పష్టమవుతోంది. దుంపకుళ్లను తట్టుకునే వంగడాలు అందుబాటులోకి వస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

మద్దతు ధర కోసం పోరాటం..

పసుపు పంట క్వింటాలుకు రూ.15వేలు మద్దతు ధర ఇవ్వాలని, పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని పుష్కర కాలంగా రైతులు పోరాటాలు చేస్తున్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోవడం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. దీంతో పసుపు పంటను సాగు చేయాలంటే పలువురు రైతులు జంకుతున్నారు. సంప్రదాయ పంట కావడం వల్ల కొందరు రైతులు ధర లేకున్నా, సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వెంటనే పసుపు పంటకు మద్దతు ధర కల్పిస్తూ, పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి..



పసుపు సాగు చేసిన రైతులను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. పసుపు పంటను వచ్చే సీజనులో సాగు చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పసుపు రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తేనే ముందుముందు సాగు విస్తీర్ణం తగ్గకుండా ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించాలి.

– బద్దం రాజశేఖర్, రైతు, తిమ్మాపూర్

బోనస్ ప్రకటించాలి..



పసుపు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి. ఏపీలో పసుపు రైతులకు అక్కడి వైఎస్సార్ ప్రభుత్వం బోనస్‌ను వర్తింపచేయడంతో రైతులకు మేలు జరిగింది. మద్దతు ధర అమలుతో పాటు బోనస్‌ను ఏపీలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న విషయాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి.

– గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, దొన్కల్

బతుకులు మారేదెప్పుడో..



పసుపు రైతులు లక్షల్లో పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తున్న పంటకు కనీసం గిట్టుబాటు ధర రావడం లేదు. దీంతో ఏటేటా అప్పులు పెరిగి పోతున్నాయి. పెట్టిన పెట్టుబడి కాదు కనీసం చేసిన శ్రమకు కూడ కూలీ పడటం లేదు. ప్రభుత్వాలు పట్టించుకుంటేనే పసుపు రైతుల బతుకులు మారుతాయి.

– మల్లారెడ్డి, రైతు

9 నెలలు కష్టపడుతున్నాం..



పసుపు పంటను సాగు చేయుట కోసం 9నెలలు కష్టపడుతున్నాం. ఏడాదిలో ఒకటే పంట సాగు చేస్తున్నాం. ఎంత శ్రమ చేసిన ఫలితం దక్కడం లేదు. క్వింటాలుకు రూ.5వేలు ధర వస్తే ఎట్ల బతుకుతాం. పసుపు పంటకు ఎలాంటి మద్దతు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– ముత్యంరెడ్డి, రైతు

హిందూ సంస్కృతి ఉన్నతమైంది



హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ఎడపల్లి(బోధన్): హిందూ సంస్కృతి ఉన్నతమైనదని, ప్రపంచ మేధావులందరూ హిందూ సంస్కృతిపై అవగాహన పెంచుకుంటున్నారని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీ అన్నారు. మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో ఆదివారం దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. హైందవ సంస్కృతిలో ప్రతి మాటకు ఒక అర్థం ఉందన్నారు. హిందువుల సంస్కృతి సంప్రదాయాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, హైందవులు చేసే ఉపవాసాలపై యూరప్ దేశాల శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారని అన్నారు. ఉపనిషత్తులు, శ్లోకాలపై కూడా పరిశోధనలు చేసి వాటి విశిష్టతను తెలుసుకుంటున్నారని అన్నారు. హిందూ సంస్కృతిపై పాశ్చాత్య దేశాలు తెలుసుకుంటున్న సందర్భంలో మనదేశంలో మతమార్పిడులు జరుగుతున్నాయని ఆవేదన చెందారు. నందిపేట కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహారాజ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఠాణాకలాన్ గ్రామంలో మాణిక్ ప్రభుమఠం, హనుమాన్ ఆలయాలను అయన సందర్శించారు మాజీ ఎంపీపీ బిల్లా రామ్మోహన్, శారద, జెడ్పీ వైస్‌చైర్మన్ రజిత యాదవ్, మాజీ జెడ్పీటీసీ సరోజినమ్మ, ఎంపీటీసీ వనజ నాగరాజు, ఎల్లయ్య యాదవ్, సంతోష్ గౌడ్, పురుషోత్తం, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సాయిలు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న స్వామీజీ

చదువు అర్థం కావడంలేదని..

- విద్యార్థిని బలవన్మరణం

మాచారెడ్డి: ఎంత చదువుతున్నా అర్థం కావడం లేదన్న ఆవేదనతో ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని వెల్పుగొండ గ్రామంలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెల్పుగొండ గ్రామానికి చెందిన ఎడ్ల సిద్దిరాములు చిన్న కూతురు కావ్య(17) సదాశివనగర్ మండలం మర్కల్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవుల్లో ఇంటికి వచ్చిన కావ్యకు స్కిన్ అలర్జీ రావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రిలో చూపించారు. సెలవులు ముగియడంతో సోమవారం కాలేజీకి వెళ్లాలని తండ్రి చెప్పగా.. తనకు చదువు అర్థం కావడం లేదని, వెళ్లనని మారాం చేసింది. దీంతో తల్లిదండ్రులు సముదాయించి, కళాశాలకు వెళ్లడానికి ఒప్పించారు. ఆదివారం తల్లిదండ్రులు చేనుకు వెళ్లిన తర్వాత కావ్య చున్నీతో ఇంటి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన బంధువు గమనించి కావ్య తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై (ఇన్‌సెట్‌లో) కావ్య (ఫైల్)

అ'పూర్వ' సమ్మేళనం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో గల ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో 1986–87 సంవత్సరంలో 10వ తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 35ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు.



బోధన్‌లో 1986-87 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



రెంజర్లలో గురువులతో 1994-95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ కలుసుకొని ఒకరినొకరు యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పుడు చదువు నేర్పిన గురువులను సన్మానించారు.

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2002–2003 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా అప్పుడు తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు.ప్రతియేటా సమ్మేళనం నిర్వహించుకోవాలని, స్నేహితుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.



తిప్పాపూర్‌లో 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

అధికారుల పేరుతో అక్రమ వసూళ్లు

- బెల్టుషాపుల నుంచి ప్రతినెలా రూ.20వేలు వసూలు చేస్తున్న వైన్ షాపు యజమానులు



మోర్తాడ్(బాల్కొండ): ఎక్సైజ్, పోలీసు ఉద్యోగులకు మామూళ్లు ఇవ్వాలనే సాకు చూపుతూ కొందరు వైన్స్ యజమానులు బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్లు ఇస్తున్నామనే ధీమాతో ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువ మొత్తానికి మద్యం అమ్మకాలను బెల్టుషాపుల నిర్వాహకులు కొనసాగిస్తున్నారు. మామూళ్ల దందా వల్ల మందుబాబుల జేబులకు చిల్లుపడుతుంది. అయినా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మోర్తాడ్ ఎక్సైజ్ పరిధిలో..

మోర్తాడ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, వేల్పూర్ మండలాలు ఉన్నాయి. వీటిలో 11 మద్యం దుకాణాలు అధికారికంగా కొనసాగుతుండగా సుమారు 40 బెల్టుషాపులు అనధికారికంగా కొనసాగుతున్నాయి. ఇందులో కొన్నింటిని వైన్స్‌ల యజమానులే నిర్వహిస్తున్నారు. మరికొన్నింటిని గ్రామాభివృద్ధి కమిటీలకు విరాళం చెల్లిస్తూ ఆయా గ్రామాలలోని వ్యక్తులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఎక్సైజ్, పోలీసు అధికారులకు ప్రతి నెలా మామూళ్లు ఇవ్వాలని వైన్స్‌ల యజమానులు బెల్ట్‌షాపుల నిర్వాహకులకు ఒత్తిడి చేస్తున్నారని తెలుస్తుంది. తాము అడిగినంత మామూళ్లు ఇవ్వకపోతే బెల్టుషాపులకు మద్యం అమ్మకాలను నిలిపివేస్తున్నారని సమాచారం.

బెల్టుషాపు నిర్వాహకులు సుమారు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వైన్స్ యజమానులకు ఇస్తున్నారు. తాము మామూళ్ల ఇవ్వమని ఎవరైనా బెల్టుషాపుల నిర్వాహకులు మొండికేస్తే వారిపై అక్రమ కేసులను నమోదు చేయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమ సిట్టింగ్‌లపై ఆదేశాలు బేఖాతర్..

అక్రమంగా మద్యం సిట్టింగ్‌లను నిర్వహించకూడదని ఎక్సైజ్, పోలీసు శాఖలు సూచించినా కొన్ని చోట్ల అధికారుల ఆదేశాలు బేఖాతర్ అవుతున్నాయి. బెల్టుషాపులను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాల చుట్టూ డేరా చుట్టి అక్రమంగా సిట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు అధికారులు స్పందించి అక్రమ వసూళ్లపై, సిట్టింగ్‌లపై విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు..

బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరుపుతాం. బెల్టుషాపుల్లో సిట్టింగ్‌లు ఉండకూడదు. ఒకవేళ ఎవరైనా సిట్టింగ్‌లు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అక్రమ వసూళ్లు, అక్రమ సిట్టింగ్‌లను సహించేది లేదు.

– గుండప్ప, ఎక్సైజ్ సీఐ, మోర్తాడ్

క్రైం కార్నర్

ట్రాక్టర్ కింద పడి ఒకరి మృతి

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన మిర్జోటి అనిల్(19), నవీపేట మండలంలోని బినోల గ్రామంలో నందుగౌడ్‌కు చెందిన ఇటుక బట్టీలో పనిచేసేవాడు. కాగా ఆదివారం ఇటుక లోడుతో ట్రాక్టర్‌పై నందిపేట మండలంలోని తల్వేద గ్రామానికి వచ్చాడు. ఇటుకలను అన్‌లోడ్ చేసేందుకు ట్రాక్టర్‌పై నుంచి దూకగా డ్రైవర్ చూసుకోకుండా వెనుకకు తీసుకోవడంతో ట్రాక్టర్ కింద పడి అనిల్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

చెరువులో పడి ఒకరు..



బాలుగొండ మృతదేహం

బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో చెరువు దాటుతుండగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కిష్టాపూర్ గ్రామానికి చెందిన పర్సు బాలుగొండ(55) శనివారం తమవద్ద గొర్లుకాచే గొర్లకాపరికి అన్నం సద్ది ఇచ్చి రావడానికి ఇంటి నుంచి వెళ్లాడు. చెరువుదాటి అవతలివైపు గొర్లమందవైపు వెళుతుండగా నీటమునిగి మృతిచెందాడు. ఆదివారం మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు బీర్కూర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అన్నకూతురు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నగరంలో చైన్ స్నాచింగ్

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆర్మూర్‌రోడ్డు బైపాస్ చౌరస్తాలో ఆదివారం ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును ఓ యువకుడు తెంపుకుని పారిపోయాడు. అప్రమత్తమైన మహిళ గట్టిగా కేకలు వేయటంతో స్థానికులు నిందితుడిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పిట్లం – బాన్సువాడ రహదారిపై శనివారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం గ్రామానికి చెందిన రాజు బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా.. నస్రుల్లాబాద్ మండలం మిర్జపల్లి గ్రామానికి చెందిన రాములు బైక్‌పై బాన్సువాడ వైపు బయలుదేరారు. ఇరువురు పిట్లం – బాన్సువాడ రహదారిపై ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని అక్కడి నుంచి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: బీర్కూర్‌లోని ఇందిరమ్మ కాలనీలో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే ఎర్రసాయిలు(65)కు భార్య 2020లో క్యాన్సర్‌తో మృతిచెందింది. అతడికి ఇద్దరు కుమారులు ఉన్నప్పటికీ వారి వద్ద కాకుండా ఒక్కడే కూలీనాలి చేసుకుంటూ ఒంటరిగా జీవించేవాడు. ఈక్రమంలో ఆదివారం జీవితంపై విరక్తిచెంది, ఇంట్లోని రేకులషెడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుమారుడు చిన్నసాయిలు బీర్కూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.